క్లుప్తంగా

పేదలకు చేయూత



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని శ్రీసత్యసాయి అన్న ప్రసాదం, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సాయిబాబా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ట్రస్టు చైర్మన్ లలితమ్మ మాట్లాడుతూ.. 2011 నుంచి ట్రస్టు నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద మహిళలకు టైలరింగ్, విద్యార్థులకు స్టేషనరీ వంటివి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాండురంగయ్య, దామోదర్‌నాయుడు, మిద్దెల రామయ్య, పాండు, చెంగయ్య, సునీల్, మధు పాలొన్నారు.

హుండీ చోరీ

నాగలాపురం : మండలంలోని ఎస్.ఎస్.పురంలోని హరిజన వాడలోని మాతమ్మ ఆలయంలో స్టీలు హుండీ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా.. మాతమ్మ ఆలయాన్ని అర్చకులు గురువారం ఉదయం తెరవడానికి వెళ్లిన సమయంలో గేటుకు ఉన్న తాళం విరిగి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా హుండీ కనపడలేదు. ఈ మేరకు ఆలయ అర్చకులు, గ్రామస్తులు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాల్యవివాహాలను అడ్డుకుందాం

నారాయణవనం : బాల్య వివాహాలను అడ్డుకోవాలని పలువురు వక్తలు సూచించారు. గురువారం మండల సభాభవనంలో ఎంపీడీఓ గుణశేఖర్ అధ్యక్షతన కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో గుణశేఖర్, సీడీపీఓ శోభారాణి మాట్లాడుతూ.. కిశోరప్రాయ దశలో బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. డిప్యూటీ డీఈఓ ప్రభాకర్ రాజు, ఏపీఎం మమతా, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ విద్య, స్వయం సాధికారికత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆర్థిక భరోసా



ఆర్థిక సాయాన్ని ఎంఈఓకు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

వరదయ్యపాళెం : మండలంలో విధులు నిర్వహిస్తూ గతేడాది బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు త్రివేణి, ఆమె సొంత జిల్లా శ్రీకాకుళంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమెకు గురువారం వరదయ్యపాళెం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు త్రివేణి కుటుంబానికి రూ.57,500 ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శశికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సరస్వతి, యూటీఎఫ్ నాయకులు కొండలరావు, వెంకటమోహన్, రుషేంద్ర బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

రేణిగుంట : మండలంలోని ఆర్.మల్లవరంలో గురువారం రాస్ చైల్డ్ ఫండ్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. వైద్య నిపుణులు డాక్టర్ ఆనంద్ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

డిజిటల్ బోర్డు వితరణ



ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈఓ ప్రభాకర్‌రాజు

నారాయణవనం : స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌కు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ సంస్థ ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డును వితరణగా అందజేశారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్యానల్ బోర్డును డిప్యూటీ డీఈఓ ప్రభాకర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ఉదయకుమార్ మాట్లాడుతూ.. పాఠ్యాంశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శశికళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యంత్ర సేవలు మాయం

అన్నదాతల సాగు అవసరాలను తీర్చి యాంత్రీకరణ ద్వారా సాగు వ్యయం తగ్గించి ఆదాయం పెంచాలనే బృహత్తర లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యంత్రసేవా కేంద్రాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. అయితే కూటమి ప్రభుత్వం యంత్ర సేవా కేంద్రాల (సీహెచ్‌సీ)లను నిరుపయోగ కేంద్రాలుగా మార్చేసి రైతులను కష్టాల్లోకి నెట్టేసింది.

వరదయ్యపాళెం సీహెచ్‌సీ నుంచి అందజేసిన వరికోత యంత్రం, గడ్డిమోపును చుట్టే యంత్రం





- 87 సీహెచ్‌సీలకు మంగళం
- రాయితీ యంత్రాల ఊసెత్తని ప్రభుత్వం
- అన్నదాతల ఎదురుచూపులు



వరదయ్యపాళెంలో సీహెచ్‌సీ కేంద్రాలకు ట్రాక్టర్ల పంపిణీ (ఫైల్)

వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచింది. అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్నా రైతుల కోసం ఒక్క పథకాన్ని అమలు చేయలేదు. గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల నుంచి గత ప్రభుత్వం సేవలను రైతులకు ముంగిటకు తీసుకొస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోంది. అంతేకాక గతంలో రైతన్నల కోసం చేపట్టిన పథకాలను పూర్తిగా విస్మరిస్తోంది. రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందించే యంత్రసేవా కేంద్రాల (కస్టమ్ హైరింగ్ సెంటర్స్)కు ఎలాంటి తోడ్పాటు అందించడం లేదు. ఆ సెంటర్లను కనుమరుగు చేసే దిశగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులేస్తోంది. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సంతవేలూరు మండలాల పరిధిలో 87 రైతు భరోసా కేంద్రాలు ఉండేవి. ప్రతి రైతు ఆ కేంద్రం వద్ద అయిదుగురు రైతులతో కలిసి ఒక యంత్ర సేవా కేంద్రం ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గంలో 435 రైతులతో 87 సీహెచ్‌సీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ కేంద్రాల గురించి ప్రస్తుతం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

పెట్టుబడి భారం తగ్గించేలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి భారం తగ్గించే విధంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల సాయంతో వ్యవసాయం చేసుకునే విధంగా యంత్ర పరికరాలను రాయితీపై అందించి రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని అమలు చేసింది. దీని ద్వారా గ్రామాల్లో రైతులను సభ్యులుగా చేర్చి సంఘాలుగా ఏర్పాటు చేసి వాటిని కస్టమ్స్ హైరింగ్ సెంటర్లుగా (సీహెచ్‌సీ) నెలకొల్పారు. ఈ కేంద్రాలను ప్రభుత్వం 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంకు రుణం ఇప్పించి వ్యవసాయ పరికరాలను అందించారు. యంత్ర పరికరాల్లో భాగంగా ట్రాక్టర్, వరికోత మిషన్లు, రోటావేటర్లు, దుక్కి దున్నే నాగళ్లు, పవర్ టిల్లర్లు, టార్పాలిన్ పట్టలు వంటివి అందజేసేవారు. ఈ పరికరాలను సంఘం పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి సంఘం సభ్యుల తీర్మానం మేరకు సమీప రైతులు వ్యవసాయానికి ఈ యంత్ర పరికరాలతో తక్కువ ఖర్చుతో వినియోగించుకుని వ్యవసాయం చేపట్టేవారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరడమే కాకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గేవి. తద్వారా సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 80 ట్రాక్టర్‌లతో పాటు ఇతర పరికరాలను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడమే కాకుండా వారికి మేలు చేస్తున్న సీహెచ్‌సీలకు తగిన తోడ్పాటు అందించడం లేదు. కొత్త సెంటర్ల ఏర్పాటు అసలే లేదు. కనీసం కూటమి ప్రభుత్వంలో రాయితీ ద్వారా నూతన యంత్రాలైన పంపిణీ చేస్తే రైతులకు కొంత ఊరట కలుగుతుందని, నియోజకవర్గంలో రైతులు ఎదురుచూస్తున్నారు.

తక్కువ ఖర్చు



గత ప్రభుత్వంలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా అందించిన వివిధ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లతో రైతులకు మేలు జరిగింది. తక్కువ ఖర్చుతో ఈ పరికరాలను వాడుకున్నాం. దీని వల్ల వ్యవసాయానికి పెట్టుబడులు తగ్గాయి.

– జగదీష్, రైతు, మిట్టకండ్రిగ

కూలీల సమస్య తగ్గుతుంది



వ్యవసాయానికి పెట్టుబడి పెరిగిపోతున్న ప్రస్తుత రోజుల్లో యంత్ర పరికరాలతో ఖర్చు తగ్గుతుంది. కూలీల సమస్య వేధిస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వ స్పందించి రాయితీపై మరిన్ని యంత్రాలు, ఇతర పరికరాలను అందించాలి.

– భూషణం, రైతు, రాచర్ల

అనుమతి రావాల్సి ఉంది



రాయితీ పరికరాలు, యంత్రాల పంపిణీ గురించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రస్తుత సీహెచ్‌సీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసిన ట్రాక్టర్లు ఆయా రైతుల నుంచే వినియోగిస్తున్నారు. నూతన రాయితీ యంత్రాలు, పరికరాల పంపిణీ విషయమై ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల మేరకు అందజేస్తాం. ఇటీవల జరిగిన బడ్జెట్‌లో యంత్ర పరికరాల కోసం నిధులు కేటాయించినట్లు సమాచారం.

– సుబ్రహ్మణ్యం, ఏడీఏ, సత్యవేడు సబ్ డివిజన్

బాధిత బాలుడికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పర్వీన్, దిలీప్ దంపతుల 8 ఏళ్ల కుమారుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నేతలు తమ వంతు సాయంగా ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి ద్వారా నగదును వారి తల్లిదండ్రులకు గురువారం అందించారు. బాధిత బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మునిచంద్ర, శివ, వేణు, చరణ్, మహేష్, నీరజ్ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో రామకృష్ణ

నారాయణవనం : మాజీ సీఎం ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయించారు.

ఆలయ సేవలో దాతలు



బాలసుబ్రహ్మణ్యంకు జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లకు వెండి అంబారీలను గతంలో సమర్పించుకున్న దాతలు బాలసుబ్రహ్మణ్యం దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కంఠా ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



వరదయ్యపాళెం : హైస్కూల్‌లో కోలాటం వేస్తున్న విద్యార్థినులు



ముగ్గుల పోటీల్లో మహిళలు, విద్యార్థులు



పాతవీరాపురంలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

వరదయ్యపాళెం : సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రమైన వరదయ్యపాళెం హైస్కూల్‌లో ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో వేసిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోలాట నృత్యాలు సందడిగా మారాయి. సాయంత్రం భోగి మంటలు వేసి సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పీడీ బందిల కుమార్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలంలోని కొత్తవీరాపురం వడ్డిమిట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ, ఉపాధ్యాయరాలు ఉష పిల్లలతో కలసి భోగిమంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం భువనేశ్వరి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

సత్యవేడు: బాలికల గురుకుల పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలికల గురుకుల ప్రిన్సిపల్ ప్రసూన, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాణి, డిల్లీరాణి, డివి. రాజు, హిమబిందు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఎస్టీ కమిషన్



గిరిజన కాలనీలో వడిత్యా సోమ శంకర్ నాయక్‌కు అర్జీలు అందజేస్తున్న మహిళలు

సత్యవేడు : గిరిజనులను ఆదుకోవడం, హక్కులు కాపాడడానికి ఎల్లవేళలా ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమ శంకర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఎస్టీ కమిషన్ సభ్యుడు సత్యవేడు మండలంలోని దాసుకుప్పం, సత్యవేడు, రాజగోపాలపురం, కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనుల కుటుంబాల అభివృద్ధి చెందాలంటే ప్రతి కుటుంబంలోని పిల్లలు ఉన్నత చదువులు చదివించాలన్నారు. పేద ఎస్టీల జీవితాల్లో విద్యతోనే మార్పు సాధ్యమవుతుందన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మార్చేందుకు మండల అధికారులు సహకారం అందించాలని సూచించారు. పలు గ్రామాల్లో ఎస్టీలకు శ్మశానాలు లేవని తన దృష్టికి వచ్చిందని స్థలాలు ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కాలనీల్లో సబ్‌ప్లాన్ కింద 6 శాతం నిధులు వెచ్చించాల్సి ఉందని అధికారులకు సూచించారు. బాలగోపలాపురానికి అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. పేరడంలో గిరిజనులకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చొరవ చూపాలని తహసీల్దారును కోరారు. నాలుగు గిరిజన కాలనీల్లోని సమస్యలు పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, రమేష్, గూడూరు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి బేబీరాణి, ఏపీఎం డాంగేయాద్, ఏఎస్ డబ్ల్యూఓ కృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఫారెస్టు సెక్షన్ అధికారి దేవరాజు, ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

పూలసాగు లాభదాయకం



పూల సాగుపై సూచనలిస్తున్న అధికారులు

నారాయణవనం : అధిక లాభాలను అందించే పూల సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని ఉద్యాన వన శాఖాధికారులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అరణ్యకండ్రిగ రైతు సేవా కేంద్రంలో పూల సాగు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి , జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం పూల సాగును పరిశీలించారు. సంపెంగ, రోజా తదితర పూలను నిల్వ ఉంచేందుకు కూలర్లను రాయితీపై అందించడానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. పుత్తూరు క్లస్టర్ ఉద్యానవన అధికారి సౌజన్య, సేవా కేంద్ర అసిస్టెంట్ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట



బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : ప్రభుత్వ వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యమే తిరుపతిలో తొక్కిసలాటకు దారి తీసిందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. నేతలపై కేసులు పెట్టడం, వేధింపుల మీద ఉన్న శ్రద్ధ భక్తుల మీద లేదని విమర్శించారు. తిరుమల లడ్డూ పేరుతో గతంలో అబద్ధాలు, ఇప్పుడు ఈ విధంగా చావులతో పవిత్రత మంట గలుపుతున్నారన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో మరో చీకటి రోజన్నారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని దీనికి పాలకమండలి, ప్రభుత్వాధికారులు బాధ్యత వహించాలన్నారు. అలాగే మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధితులను పరామర్శించేందుకు వస్తుంటే ఆస్పత్రికి పోకుండా అడ్డంకులు కల్పించారని, ఆస్పత్రిలో గాయాలతో ఉన్నవారిని సైతం డిశ్చార్జి చేయడం ఈ ప్రభుత్వ విపరీత ధోరణులకు అద్దం పడుతోందన్నారు.

గతంలో గోదావరి పుష్కరాల్లో ప్రచారం కోసం చావులు జరిగితే. ఇప్పుడు అలసత్వం వల్ల జరిగాయన్నారు. మరో సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. టోకెన్ల జారీలో అధికారుల వైఫల్యం కారణంగానే ఈ ఘటన జరిగిందన్నారు. టీటీడీ అధికారులు అరకొర ఏర్పాట్ల ఫలితమే ఈ ఘటనకు కారణమన్నారు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చేనేత సంక్షేమానికి కృషి చేయాలి



క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి : చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ చైర్మన్, ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం చేనేత కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గత 34 సంవత్సరాలుగా చేనేత కార్మిక సంఘాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలన్నారు. ఎన్టీఆర్ నేతన్న నేస్తం కింద రూ.30 వేలు ఇస్తామన్న హామీ నెరవేర్చాలన్నారు. ఆరోగ్యబీమా , 3 సెంట్ల స్థలం ఇచ్చి రూ.7 లక్షలతో గృహం, వర్క్‌షెడ్ పథకం అమలు చేయాలని కోరారు. పట్టు, నూలు, జరీపై 50శాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆకుల వాసు, వెంకటమణి, షణ్ముగశర్మ, ప్రభాకర్, హేమభూషణం, నాగార్జున, నారాయణ, చెన్నయ్య, శంకరయ్య, నాగేశ్వరరావు, మునిరాజా, శేషయ్య, గురునాథం, పద్మశాలిపేట, భాస్కరపేట, దామా నెల్లూరు నుంచి చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మురుగుమయం.. వ్యాధుల భయం



మండల కేంద్రంలోని పిచ్చాటూరు ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహ ఆవరణలో మురుగు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో వసతి విద్యార్థులు వ్యాధుల బారీన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వసతి గృహాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతోపాటు మరుగుదొడ్ల తలుపులు ధ్వంసం కావడంతో కాలకృత్యాలకు ఆరు బయటకు వెళ్తున్నారని విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – నాగలాపురం

రహా‘దారుణాలు’



జంబుగోళం వద్ద రోడ్డు మధ్యలో గుంత



జీఎన్‌కండ్రిగ వద్ద కంకరతేలిన రహదారి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని జంబుగోళం, తహనగర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు దారుణంగా మారాయి. దీంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్.అనంతపురం, జీఎన్‌కండ్రిగ, పూసలపల్లి, తహనగర్, జంబుగోళం, చిన్నయగుంట, బంగ్లాతోట గ్రామాల రోడ్లు తుపాన్ ప్రభావంతో గుంతలమయంగా మారాయి. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. రోడ్డుపై గ్రామస్తులు నడవటానికి కూడా అవస్థలు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



విద్యుత్ దీపాల అలంకరణలో వెంకన్న ఆలయం

నారాయణవనం : వైకుంఠ ఏకాదశికి పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం 4 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారని చెప్పారు. శనివారం ఉదయం 8.40 గంటలకు భక్తులను ఉత్తర ద్వార ప్రవేశానికి అనుమతిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

వేదనారాయణ స్వామి ఆలయంలో..

నాగలాపురం : మండల కేంద్రంలోని శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం ఉంటుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.